సాక్షి
నిజామాబాద్
శనివారం ‌। 28 । అక్టోబర్ । 2023



అమాత్యుల అడ్డా..
ఉమ్మడి జిల్లా నుంచి 14 మంది మంత్రులుగా పని చేశారు. జుక్కల్ మినహా అన్ని నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం లభించింది.
- 12లో ▸



ఎన్సీపీ అభ్యర్థులు వీరే..
నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విఠల్ ప్రకటించారు. తమ పార్టీని గెలిపించాలని కోరారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.0 /18.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రతినెలా 27న నిధి ఆప్కే నికట్ 2.0



మోపాల్(నిజామాబాద్‌రూరల్): పీఎఫ్ చందాదారులు, పెన్షన్ల కోసం ఇక నుంచి ప్రతినెలా 27న నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఆ వేదికను ముందుగానే తెలియజేస్తామని తెలంగాణ రీజినల్ కమిటీ సభ్యుడు ఆర్‌డీ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మోపాల్ మండలంలోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో కేంద్ర ప్రభుత్వం, ఈపీఎఫ్‌వో సౌజన్యంలోభాగంగా పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఈపీఎఫ్‌వో సంస్థలో వివిధ ప్రయోజనాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, అర్హత, అవసరాల గురించి అధికారులు సభ్యులకు వివరించారు. ఈపీఎఫ్ఓ కింద కవర్ చేసిన యజమానులు, పీఎఫ్ చందా దారులు, పెన్షన్లు హాజరు కాగా, వారి సమస్యలు, ఫిర్యాదులను సేకరించి తక్షణమే పరిష్కరించారు. కార్యక్రమంలో రీజినల్ పీఎఫ్ కమిషనర్ గణేష్‌కుమార్, సహాయక పీఎఫ్ కమిషనర్ మధుసూదనాచారి, ఈఎస్ఐసీ మేనేజర్ మాల్యాద్రి, పవన్‌కుమార్, శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకే కవాతు



బోధన్‌టౌన్: ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకే పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని రాకాసీపేట్‌లో శుక్రవారం కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు అహర్నిషలు కృషి చేస్తారని, ప్రజలు సహకరించాలని కోరారు. కవాతులో సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలంటూ నిరసన



ఎడపల్లి: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కుర్నాపల్లి రైతులు శుక్రవారం రహదారిపై ధాన్యం పోసి నిరసన తెలిపారు. చిన్న సన్నకారు రైతుల నుంచి దళారులు ధాన్యం కొనుగోలు చేయడం లేదని, దీంతో తాము ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

జీజీహెచ్‌కు ఉత్తమ ప్రశంసపత్రాలు



ఖలీల్‌వాడి: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అంతర్జాతీయ సంస్థల ప్రశంసపత్రాలు వచ్చినట్లు జీజీహెచ్ సూపరిండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో జాతీయ స్థాయిలో పీడియాట్రిక్ విభాగంలో జీజీహెచ్, జీఎంసీ ఉత్తమ ప్రశంస పత్రాలు గుర్తింపును సాధించడం సంతోషదాయకమన్నారు. మలేసియాకు చెందిన వాబా, భారత్‌కు చెందిన బీపీఎన్ఐ అంతర్జాతీయ సంస్థల ఆధ్వర్యంలో 2023, ఆగస్టు 1 నుంచి 7 వరకు నర్సింగ్ విద్యార్థులకు తల్లిపాలపై శిక్షణ, చర్చ, ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన, ఆసుపత్రిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపినట్లు చెప్పారు. తల్లిపాల ప్రాముఖ్యతకు సంబంధించిన చిత్రలేఖనం, ప్రదర్శన అంశంపై ప్రతిజ్ఞ కార్యక్రమం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో ఈ ప్రశంస పత్రం లభించిందని, పీడియాట్రిక్ వైద్యులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో వైద్యులు కవిత, శ్రీనివాస్, గోపాల్ సింగ్, రాజశేఖర్, నిరూప్ రెడ్డి, దీపక్ రాథోడ్ పాల్గొన్నారు.

స్మార్ట్‌గా సోషల్ వార్..

ఈసారి సాధారణ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రచారానికి పార్టీల అభ్యర్థులు ఎక్కువ ఆసక్తి చూపడం విశేషం. ఇందుకు గాను ప్రత్యేకంగా సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణులను ఉపయోగిస్తున్నారు. ఫేస్‌బుక్ లైవ్‌లు, యూట్యూబ్ లైవ్ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులు ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తుండగా.. ప్రత్యర్థి పార్టీల వారు ప్రభుత్వ వైఫల్యాలను తమ ప్రచారంలో ఎండగడుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

- ఎన్నికల ప్రచారానికి వాట్సాప్, ఫేస్‌బుక్ యాప్‌లను వినియోగించుకుంటున్న రాజకీయ పార్టీలు
- యూట్యూబ్ లింక్‌లు, లైవ్‌ల ద్వారా ప్రచార కార్యక్రమాలు
- పంచ్ డైలాగ్‌లతో వీడియోలు చేసి వైరల్ చేస్తున్న వైనం
- ఇందుకోసం క్షేత్రస్థాయిలో జీతాలు ఇచ్చి మరీ సిబ్బంది నియామకం
- మరోవైపు ప్రచారం నేపథ్యంలో సమస్యలపై నిలదీస్తున్న యువత



సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం చేస్తున్నప్పటికీ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి స్మార్ట్ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండడం గమనార్హం. ప్రజల నుంచి సైతం సోషల్ మీడియా ప్రచారానికి ఎక్కువ ఆసక్తి కనిపించడం విశేషం. దీంతో గతానికి భిన్నంగా విచ్చలవిడిగా కరపత్రాలు పంచడం, ప్రెస్‌మీట్లు పెట్టడం లాంటి కార్యక్రమాలు తగ్గించారు. ప్రతి ఒక్కరికీ స్మార్ట్ ఫోన్ ఉండడం, ఇంటర్నెట్ అపరిమితంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా భారీ ఎత్తున ప్రచారం చేసేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గం, మండలం, గ్రామం, వార్డుల వారీగా, కులాలు, సంఘాల వారీగా, యువజన సంఘాల పేరిట ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని నిర్వహించేందుకు గాను ప్రత్యేకంగా జీతాలు ఇచ్చి మరీ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణులను ఉపయోగిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ప్రచారం చేసినా ఆయా ప్రచారం అన్ని గ్రూపుల్లో వచ్చే విధంగా ప్లాన్ చేసుకుని ముందుకు వెళుతున్నారు. ఫేస్‌బుక్ లైవ్‌లు, యూట్యూబ్ లైవ్‌లు సైతం పెట్టుకుని ప్రచారం సాగిస్తున్నారు. పార్టీల మేనిఫెస్టోలోని పథకాల గురించి ప్రచారం చేస్తూనే స్థానిక అంశాలనూ ప్రచారాస్త్రాలుగా చేసుకుంటున్నారు. కరపత్రాలను పరిమిత సంఖ్యలో ముద్రించి, వాటిని పీడీఎఫ్ ఫైల్ తయారు చేయించి వాట్సాప్ గ్రూపుల ద్వారా భారీగా వైరల్ చేస్తున్నారు. వాట్సాప్ స్టేటస్‌లకు సైతం మరింత ప్రాధాన్యత పెరగడం గమనార్హం. వ్యక్తుల వాట్సాప్ స్టేటస్‌లను బట్టి సదరు వ్యక్తి ఆలోచనలను అంచనా వేసుకుంటూ అందుకు అనుగుణంగా అలాంటి వ్యక్తులను కన్విన్స్ చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

- కొందరు యువకులు మాత్రం జిల్లాలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ వైఫల్యాలు, అపరిష్కృత సమస్యలు, పోటీ పరీక్షల విషయమై ప్రభుత్వం వైఫల్యాలు, పేపర్ లీక్‌లు తదితర అంశాలను వైరల్ చేస్తుండగా, స్థానిక సమస్యలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇటీవల నందిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు ధ్వంసమైన రోడ్ల గురించి ఎమ్మెల్యేను విమర్శిస్తూ సెటైరికల్‌గా చేసిన వీడియో వైరల్ అయింది. అదేవిధంగా ప్రభుత్వ పథకాల్లో అధికార పార్టీ నాయకులు కమీషన్లు తీసుకుంటున్నారని ఆర్మూర్‌కు చెందిన యువకులు చేసిన వీడియోలు బాగా వైరల్‌అయ్యాయి. ఇలా సోషల్ వార్ మరింత విస్తరిస్తోంది.

స్థానిక అంశాలపైనా..

గ్రామ స్థాయి నుంచి వివిధ అంశాలను ప్రచారంలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు సంబంధించిన సోషల్ టీములు ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, సంక్షేమం, ఇకపై చేయబోయే హామీల గురించి, అభివృద్ధి పనుల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు తాము గెలిస్తే స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని, తమ పార్టీ అధికారంలోకి వస్తే చేసే పథకాలు, అభివృద్ధి అంశాల గురించి వైరల్ చేస్తున్నారు. అదే విధంగా ఇప్పటివరకు అధికారంలో ఉన్న ప్రభుత్వం వైఫల్యాలు, నెరవేరని హామీల గురించి ఎత్తిచూపుతున్నారు. ఇదిలా ఉండగా కొందరు నాయకులు ప్రజల భావోద్వేగాల అంశాలకు సంబంధించి ప్రచారం చేస్తున్నారు.

భూపతిరెడ్డికే నిజామాబాద్ రూరల్

- ఎల్లారెడ్డికి మదన్ మోహన్‌రావు
- రెండో జాబితా విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ
- నిజామాబాద్ అర్బన్‌పై ఉత్కంఠ
- కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ టిక్కెట్ల విషయంలోనూ టెన్షన్



భూపతిరెడ్డి



మదన్‌మోహన్‌రావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి కాంగ్రెస్ టిక్కెట్టు ఖరారైంది. శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రెండో జాబితా విడుదల చేశారు. భూపతిరెడ్డికి పోటీగా కాటిపల్లి నగేష్‌రెడ్డి తుదివరకు టిక్కెట్టు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ పోటీ నేపథ్యంలో కేడర్ ఒకింత అసహనం ప్రదర్శించారు. ఈ క్రమంలో పార్టీలో చేరికలు సైతం వాయిదా వేసుకున్న పరిస్థితి. భూపతిరెడ్డి అభ్యర్థిత్వం ఖరారుతో ఉత్కంఠ వీడింది. నగరంలోని భూపతిరెడ్డి ఇంటి వద్ద కార్యకర్తలు పటాకులు పేల్చారు. అదేవిధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి కె మదన్‌మోహన్ రావును అభ్యర్థిగా ఖరారు చేశారు. మరోవైపు నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ టిక్కెట్ల విషయంలో పార్టీ అధినాయకత్వం ఎటూ తేల్చలేదు. జుక్కల్ సీటు విషయంలో తర్జనభర్జన కొనసాగుతుండగా, బాన్సువాడ, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ టిక్కెట్ల విషయంలో ఒకదానితో ఒకటి ముడిపెట్టిన నేపథ్యంలో ఇంకా ఎటూ తేల్చలేదు. దీంతో వీటి విషయంలో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది.

డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి

తండ్రి: రాజారెడ్డి
తల్లి: లక్ష్మినర్సవ్వ
భార్య: వినోదినిరెడ్డి, కుమారుడు, కుమార్తె
పుట్టిన తేదీ: 12–02–1964
పుట్టిన గ్రామం: జలాల్‌పూర్, నిజామాబాద్ రూరల్ మండలం
వృత్తి: సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ (డాక్టర్), ఎంబీబీఎస్, గాంధీ మెడికల్ కాలేజ్ హైదరాబాద్, ఎంఎస్, ఉస్మానియా మెడికల్ కాలేజ్, హైదరాబాద్
రాజకీయ ప్రస్థానం: టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు

- 2001 టీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి
- 2009–14 వరకు టీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జి
- 2016లో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక
- 2018లో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో విభేదాల కారణంగా టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి..
- 2018లో నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ చేతిలో ఓటమి
- 2018 నుంచి కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

కలకుంట్ల మదన్‌మోహన్‌రావు

పుట్టిన తేదీ: 01.08.1970
నివాసం: కామారెడ్డి
తల్లిదండ్రులు: వజ్రమ్మ, రాజేశ్వర్‌రావు
భార్య: ప్రీతి
పిల్లలు: కార్తీక్(కుమారుడు), తన్వీ(కూతురు)
విద్య: ఎమ్మెస్సీ (అగ్రికల్చర్)
వృత్తి: సాఫ్ట్‌వేర్ కంపెనీల నిర్వహణ
ప్రవృత్తి: సామాజిక సేవ
రాజకీయ నేపథ్యం: 2012లో టీడీపీలో చేరి, జహీరాబాద్ నియోజకవర్గంలో సైకిల్ యాత్ర ద్వారా గుర్తింపు పొందారు.

- 2018లో కాంగ్రెస్‌లో చేరిక.
- 2019లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో దిగి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు.
- పీసీసీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు అన్ని చర్యలు

- కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్, సీపీ



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

సుభాష్‌నగర్: ఓట్ల లెక్కింపునకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగించనున్న నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలను శుక్రవారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికల సామగ్రి, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వసతులను పరిశీలించారు. రవాణా, పార్కింగ్, భద్రతాపరమైన అంశాలను నిశితంగా పరిశీలిస్తూ, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్‌లో వాటర్ లీకేజీలు లేకుండా, అగ్ని ప్రమాదాల వంటి వాటికి ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్, ఫ్యాన్ల వసతి పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని ఆర్ అండ్ బీ ఇంజినీర్లకు సూచించారు. ఎలక్షన్ అబ్జర్వర్లు వచ్చే సమయానికి మరమ్మతులు, ఆధునికీకరణ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ బి నరేష్, శ్రీరాంకుమార్, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి ఆకుల లలిత

- మల్లికార్జునఖర్గే సమక్షంలో చేరిక
- నిజామాబాద్ అర్బన్‌లో మారనున్న సమీకరణాలు




మల్లికార్జునఖర్గేతో ఆకుల లలిత దంపతులు

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీలో చేరడానికి మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే సమక్షంలో పార్టీలో చేరారు. 2018లో శాసనసభ ఎన్నికలలో ఆమెకు ఆర్మూర్ టిక్కెట్‌ను కాంగ్రెస్ పార్టీ కేటాయించింది. అయితే పోలింగ్‌కు మూడు రోజుల ముందు నుంచి ఆమె ఆర్మూర్ కాంగ్రెస్ నేతలకు, ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయినప్పటికీ రెండోస్థానంలో నిలిచారు. అనంతరం సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. టీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఆశించినప్పటికీ అవకాశం దక్కలేదు. రాష్ట్ర మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి వరించింది. ఈనెల 16న బీఆర్ఎస్ తోపాటు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవికి లలిత రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆమె చేసిన ప్రయత్నాలను స్థానిక పార్టీ నేతలు వ్యతిరేకించారు. దీంతో పెద్దపల్లిలో విజయ భేరి బస్సుయాత్ర సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన ఆకుల లలిత దంపతులు వెనుతిరగాల్సి వచ్చింది. చివరికి కాంగ్రెస్‌లో ఆమె చేరికతో నిజామాబాద్ అర్బన్‌లో రాజకీయసమీకరణాలు మారే అవకాశాలు ఉన్నాయి. కాగా ఆమెకు పార్టీ టిక్కెట్టుపై స్పష్టత ఇవ్వలేదని కాంగ్రెస్ వర్గాలలో చర్చ సాగుతోంది.

బడుగుల నేత అర్గుల్ రాజారాం

- 1969 తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర
- ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా ఐదు పర్యాయాలు
- డిచ్‌పల్లి 7వ బెటాలియన్ ఏర్పాటు ఆయన కృషి ఫలితమే
- ఉన్నత స్థానాలకు ఎదిగిన ఆయన శిష్యులు డీఎస్, సంతోష్ రెడ్డి
- గుత్ప ఎత్తిపోతల పథకానికి అర్గుల్ రాజారాం పేరు

జంగ్ తెలంగాణ



వెంచిర్యాలలో ఎస్సీలకు భూ పంపిణీ చేయడానికి పూజ చేస్తున్న అర్గుల్ రాజారాం (ఫైల్)

ఆర్మూర్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, ఆర్మూర్, బాల్కొండ, నియోజక వర్గాల ప్రజల మనస్సుల్లో నిలిచి పోయిన మహా మనీషి అర్గుల్ రాజారాం. ఆర్మూర్ నుంచి ఒకసారి, బాల్కొండ నుంచి వరసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది ఉన్నత మంత్రి పదవులు నిర్వహించారు. బీసీ నేతగా ఎదిగి ఆదర్శప్రాయమైన రాజకీయాలతో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన వద్ద రాజకీయ ఓనమాలు దిద్దిన ఆయన శిష్యులు పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మాజీ మంత్రి శనిగరం సంతోష్‌రెడ్డి తదితరులు రాష్ట్ర రాజకీయాల్లోనే క్రియాశీల పాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతమైన ఆర్మూర్ ప్రాంతంలోని 38 వేల 792 ఎకరాలకు సాగునీరందించే గుత్ప ఎత్తిపోతల పథకానికి అర్గుల్ రాజారాం పేరు పెట్టారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దివంగత నేత అర్గుల్ రాజారాం కుటుంబీకులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008 మార్చి 18న ఆవిష్కరించారు.

ఆదర్శం ఆయన రాజకీయ జీవితం...

జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలోని మధ్య తరగతి, బలహీన వర్గానికి చెందిన అర్గుల్ రాజన్న, రాజవ్వ దంపతులకు జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీకాం పట్టా పొందారు. విద్యార్థి దశనుంచే సోషలిస్టు భావాలతో ముందుకుసాగారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 1969లో జరిగిన తొలి విడత ఉద్యమంలో మర్రి చెన్నారెడ్డితో కలిసి క్రియాశీలంగా పాల్గొన్నారు.

- సోషలిస్టు నాయకుడు జయప్రకాష్ నారాయణ శిష్యరికంతో 1952లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- 1957లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 1962లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఫత్తేపూర్ శ్రీధర్‌రెడ్డిపై బాల్కొండ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 1967లో బాల్కొండ ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- పీవీ నర్సింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జౌళి, చేనేత, చక్కర పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు.
- 1969లో తెలంగాణ ఉద్యమంలో అగ్రనేతగా ముందున్నారు. మర్రి చెన్నారెడ్డితో పాటు రాజమండ్రిలో జైలు జీవితాన్ని గడిపారు.
- 1972లో ధర్మోరా రాజేశ్వర్‌రెడ్డిపై అర్గుల్ రాజారాం బాల్కొండ స్థానానికి పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందారు.
- 1972లో విద్యుత్ శాఖ మంత్రి, పశు గణాంక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.
- 1978లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా బాల్కొండ నుంచి పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందారు.
- ఇదే సమయంలో అర్గుల్ రాజారాం అనుచరుడు శనిగరం సంతోష్‌రెడ్డిని ఆర్మూర్ ఎమ్మెల్యేగా నిలబెట్టి గెలిపించారు.



ఆర్మూర్ మాజీ సర్పంచ్ దేవిదాస్ శర్మతో తేనీటి విందులో అర్గుల్ రాజారాం(ఫైల్)



డీ శ్రీనివాస్

సుశీలదేవి

సంతోష్ రెడ్డి

ఆర్మూర్, బాల్కొండలో అభివృద్ధి..

ఆర్మూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డిచ్‌పల్లిలోని 7వ బెటాలియన్ ఆయన కృషి ఫలితమే. ఆర్మూర్ పట్టణంలో ప్రభుత్వ స్థలంతో పాటు సీఎస్ఐ చర్చి ఆధీనంలో ఉన్న స్థలాన్ని మిషనరీని ఒప్పించి నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కెటాయించేలా చేశారు. ఆ కాలనీని ఆయన పేరుతోనే రాజారాంనగర్ కాలనీగా పిలుస్తారు. బాల్కొండ మండలం వెంచిర్యాల గ్రామంలో 400 మంది ఎస్సీలకు భూ పంపిణీ చేశారు. ఇంటి పేరు గడ్డం రాజారాం అయినా సొంత గ్రామాన్నే ఇంటి పేరుగా మార్చుకున్నారు. అర్గుల్ రాజారాం తమ్ముని పిల్లలు ముగ్గురిని దత్తత తీసుకున్నారు. 1981లో అర్గుల్ నుంచి హైదరాబాద్‌కు వెలుతూ మార్గమధ్యలో రామాయంపేట్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బాల్కొండ నియోజకవర్గానికి మధ్యంతర ఎన్నికల్లో ఆయన సతీమణి సుశీలాదేవి విజయం సాధించి 1983 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు.



తన స్వగ్రామంలో అర్గుల్ రాజారాం నివసించిన భవనం

- శనిగరం సంతోష్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్‌లతో పాటు ఆర్మూర్ పంచాయతి సమితి మాజీ అధ్యక్షుడు కుంట గంగారాం, మగ్గిడి గంగాధర్, పడిగల హన్మాండ్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గంట సదానందం, కుద్వాన్‌పూర్ రామారావ్, మగ్గిడి గంగాధర్‌రావు ఆయన అనుచరగణంలోని వారే.

క్లుప్తంగా

29న అథ్లెటిక్స్‌ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో ఈ నెల 29న అథ్లెటిక్స్‌ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా రూరల్‌ గేమ్స్‌ అసోసియేషన్‌ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌, ఆర్గనైజర్లు బాలు, చందు, భూపతిరాజు తెలిపారు. జిల్లా స్థాయి కరాటే, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, రన్నింగ్‌, బాస్కెట్‌బాల్‌, క్రికెట్‌, హ్యాండ్‌బాల్‌ పోటీల్లో బాలబాలికలను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల నుంచి నైపుణ్యం గల క్రీడాకారులను తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8919833851, 9014581059 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



కామారెడ్డి టౌన్‌: మహమ్మద్‌ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం రచయితల సంఘం జాతీయ వేదిక ఆధ్వర్యంలో గత నెల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో కామారెడ్డి పట్టణానికి చెందిన లెక్చరర్‌ ఉమా శేషారావు విజేతగా నిలిచారు. ఆయనకు శుక్రవారం ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.

వైభవంగా బోనాల పండుగ



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గౌరారంలో శుక్రవారం వైభవంగా గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. అన్ని కుల సంఘాల వారు ఐకమత్యంతో ఇంటికో బోనం చొప్పున భక్తి శ్రద్ధలతో సమర్పించారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నిజాంసాగర్‌(జుక్కల్‌): జుక్కల్‌ మండల కేంద్రంలోని చౌరస్తాలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్‌ నాయకులు దహనం చేశారు. రైతు బంధు, రైతు బీమా డబ్బులు అపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్‌ పార్టీ ఫిర్యాదు చేయడం పట్ల బీఆర్‌ఎస్‌ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమానికి అడ్డు తగులుతున్న కాంగ్రెస్‌ పార్టీని ఎన్నికల్లో బొందపెడుతామన్నారు. నాయకులు నీలుపటేల్‌, సాయాగౌడ్‌, శివానంద్‌పటేల్‌, తదితరులున్నారు.

బాన్సువాడ గడ్డ.. శ్రీనివాసుల అడ్డా..!

- ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించిన పోచారం
- మూడుసార్లు ఎం శ్రీనివాస్‌రావు, ఒకసారి బి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక
- ప్రధాన పార్టీలను ఆదరిస్తున్న ఓటర్లు
- ఏడుసార్లు కాంగ్రెస్‌, ఆరుసార్లు టీడీపీ, మూడు సార్లు బీఆర్‌ఎస్‌ ప్రాతినిధ్యం
- స్పీకర్‌ చరిత్ర తిరగరాసేనా..?


కత్తెర గంగాధర్‌


బాజిరెడ్డి గోవర్ధన్‌


పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నియోజకవర్గ ఓటర్లు

పురుషులు:	1,00,608
మహిళలు:	92,225
ఇతరులు:	8
మొత్తం:	1,92,841

బాన్సువాడ నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు

సంవత్సరం	అభ్యర్థి పేరు	పార్టీ
1952–57	లక్ష్మీబాయి	కాంగ్రెస్‌
1957–62	సీతాకుమారి	కాంగ్రెస్‌
1962–67	బి శ్రీనివాస్‌రెడ్డి	కాంగ్రెస్‌
1967–72	ఎం శ్రీనివాస్‌రావు	కాంగ్రెస్‌
1972–78	ఎం శ్రీనివాస్‌రావు	కాంగ్రెస్‌
1978–83	ఎం శ్రీనివాస్‌రావు	కాంగ్రెస్‌
1983–85	కిషన్‌సింగ్‌	టీడీపీ
1985–89	ఎస్‌వీఎల్‌ నరసింహరావు	టీడీపీ
1989–94	కత్తెర గంగాధర్‌	టీడీపీ
1994–99	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
1999–2004	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
2004–2009	బాజిరెడ్డి గోవర్ధన్‌	కాంగ్రెస్‌
2009–2011	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
2011–2014	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
ఉప ఎన్నిక		
2014–2018	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
2018–2023	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌





బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గం శ్రీనివాసుల అడ్డాగా మారింది. ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరుగగా 10 సార్లు శ్రీనివాస్‌ అన్న పేరు గల వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1952లో ఏర్పడ నియోజకవర్గంలో ఇప్పటికీ ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు ఎన్నో ఉన్నాయి. ఒకప్పుడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటలో ఉండేది. తెలంగాణ ఉద్యమం తర్వాత 2011 నుంచి ఓటర్లు బీఆర్‌ఎస్‌ వైపు నిలవడంతో టీడీపీ కంచుకోటలో బీఆర్‌ఎస్‌ పాగా వేసినట్లయింది. కానీ టీడీపీ జోరుకు బ్రేకులు వేసింది మాత్రం కాంగ్రెస్సే. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 15 సాధారణ ఎన్నికలు, 2011లో ఒకసారి ఉప ఎన్నిక జరిగాయి. కాంగ్రెస్‌ ఏడు సార్లు, టీడీపీ ఆరు సార్లు, బీఆర్‌ఎస్‌ మూడు సార్లు విజయం సాధించాయి. బాన్సువాడలో ప్రస్తుత స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేస్తుండడంతో ఇతర పార్టీలు కనుచూపుమేరల్లో కనిపించడం లేదు.

అత్యధిక విజయాలు..

1952లో ఏర్పడిన బాన్సువాడ నియోజకవర్గంలో మొదటిసారి నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి లక్ష్మీబాయి గెలుపొందారు. 1957లో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి సీతాకుమారి, 1962లో కాంగ్రెస్‌ నుంచి బి. శ్రీనివాస్‌రెడ్డి, 1967 నుంచి 1983 వరకు కాంగ్రెస్‌ నుంచి ఎం. శ్రీనివాస్‌రావు వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్‌ సాధించాడు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌ పార్టీ పెట్టాక నియోజకవర్గం టీడీపీకి పెట్టని కోటగా మారింది. 1983లో టీడీపీ పొత్తులో భాగంగా టికెట్‌ దక్కించుకున్న కిషన్‌ సింగ్‌ విజయం సాధించారు. 1985లో టీడీపీ నుంచి ఎస్‌వీఎల్‌ నర్సింహరావు, 1989లో టీడీపీ నుంచి కత్తెర గంగాధర్‌, 1994, 1999లో టీడీపీ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. 2004లో అనూహ్యంగా బాన్సువాడకు వచ్చిన బాజిరెడ్డి గోవర్ధన్‌(కాంగ్రెస్‌) వైపు ఓటర్లు నిలిచారు. 49,491 ఓట్ల మెజారిటీతో బాజిరెడ్డి గోవర్ధన్‌ విజయం సాధించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న బాజిరెడ్డి బాన్సువాడలో సెంట్రల్‌ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. 2009లో టీడీపీ నుంచి పోచారం, కాంగ్రెస్‌ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. 2011లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్నందున టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేసిన పోచారం ఉప ఎన్నికలకు వెళ్లారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో పోచారం విజయం సాధించారు. తెలంగాణ ప్రభుత్వంలో పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేశారు. అప్పుడే రైతు బంధు, యంత్ర లక్ష్మి పథకాలు పురుడు పోసుకున్నాయి. 2018లో జరిగి ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్‌ సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ఉన్నప్పటి నుంచి స్పీకర్‌గా వ్యవహరించిన ఒక్కరు కూడా విజయం సాధించిన దాఖాలు లేవు. కానీ ఈ సారి బాన్సువాడలో తాను చేసిన అభివృద్ధితో స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చరిత్ర సృష్టిస్తామనే ధీమాలో ఉన్నారు.

ప్రభావం చూపే అంశాలు..

ఇప్పటి వరకు జరిగి ఎన్నికల్లో ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు ఎంతగానో ప్రభావితం ముఖ్యంగా బోధన్‌–బీదర్‌ వయా బాన్సువాడ మీదుగా రైల్వేలైను ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తు వస్తున్న ఇప్పటి వరకు ఈ సమస్య ప్రతిపాదనలకే పరిమితమైంది. రైల్వేలైను ఏర్పాటు చేస్తే ముఖ్యంగా పరిశ్రమలు అందుబాటులోకి వచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కరం అవుతుందని భావిస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఎక్కువగా నిరుద్యోగ సమస్య ఉత్పన్నమవుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 2018లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి శాసనసభాపతిగా ఎన్నికైనప్పటి నుంచి అత్యధికంగా నిధుల వరద కొనసాగింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 11 వేల డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు, రూ. 10 వేల కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు కొనసాగాయి.

బాన్సువాడ నియోజకవర్గ స్వరూపం..

2018లో నాలుగు మండలాలు బాన్సువాడ, వర్ని, కోటగిరి, బీర్కూర్‌ ఉండేవి. ప్రస్తుతం బాన్సువాడ, బీర్కూర్‌, నస్రూల్లాబాద్‌, వర్ని, చందూర్‌, మోస్రా, రుద్రూర్‌, కోటగిరి, పోతంగల్‌ మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 258 పోలింగ్‌ బూత్‌లు ఉన్నాయి.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు నాబార్డు సహకారం

- టీఎస్‌ నాబార్డు డీజీఎం దీప్తి సునీల్‌
- జిల్లా కేంద్రంలో మూడురోజుల ఆర్గానిక్‌ మేళా ప్రారంభం


మేళాను ప్రారంభిస్తున్నదీప్తి సునీల్‌

నిజామాబాద్‌ సిటీ: సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు చేయూతనిచ్చేందుకు నాబార్డు సహకారం అందిస్తుందని తెలంగాణ నాబార్డు డీజీఎం దీప్తి సునీల్‌ అన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ ఆడిటోరియం ఆవరణలో నాబార్డు, సాయి వెజిటెబుల్స్‌ అండ్‌ ఫ్రూట్‌ గ్రోయర్స్‌ పరస్పర సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజుల తెలంగాణ ఆర్గానిక్‌ మేళా కార్యక్రమాన్ని దీప్తి సునీల్‌ ప్రారంభించి మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో పండ్లు, కూరగాయలు పంటలు పండించేవారు ఇప్పుడు ఎక్కువగా వరిని పండిస్తున్నారు. ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయ పంటలకు, ఉత్పత్తులకు బాగా డిమాండ్‌ ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు సేంద్రియ పంటల వైపు దృష్టి సారించాలన్నారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయాన్ని, చిరు ధాన్యం పంటలను ప్రోత్సహించటమే ఆర్గానికల్‌ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు. ఆరోగ్యానికి చిరుధాన్యం పంటలు ఎంతో మేలని వీటిని సాగుచేసేందుకు రైతులు ముందుకురావాలన్నారు. రైతు కన్వీనర్‌ కుమారస్వామి మాట్లాడుతూ.. 10మంది కలిసి తయారు చేసిన ఉత్పత్తులు ప్రాచుర్యం చెందాలంటే మార్కెటింగ్‌ చేసుకునేందుకు ఈ మేళాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రైతులు, మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెట్‌లోకి తీసుకురాడానికి నాబార్డు సహాయ సహకారాలు అందించడం సంతోషకరమన్నారు. మన దేశంలో మహిళా గ్రూపులు విజయవంతంగా నడుస్తున్నాయని, మహిళలు నడుపుతున్న ములనూర్‌ సొసైటీ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సాయి వెజిటేబుల్‌ సొసైటీ చైర్మన్‌ కొండెం సాయారెడ్డి, ఎఫ్‌పీవోలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. టీచర్లకే విధులు

- వారిదే ముఖ్య భూమిక
- ప్రస్తుత ఎన్నికలకు 4,756 మంది కేటాయింపు

నిజామాబాద్‌అర్బన్‌: ఎన్నికల విధులు అనగానే గుర్తుకు వచ్చేది ప్రభుత్వ టీచర్లు. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్‌, జడ్పీటీసీ, సర్పంచుల ఎన్నికల్లో టీచర్లే ఎక్కువగా విధులు నిర్వహిస్తుంటారు. ఇతర శాఖల నుంచి ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఎన్నికల్లో టీచర్ల విధులను వినియోగించుకుంటోంది. ప్రస్తుతం సాధారణ ఎన్నికలకు సైతం టీచర్లని కేటాయించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 1549 పోలింగ్‌ కేంద్రాలు ఉండగా 13,63,811 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీటి నిర్వాహణకు సంబంధించి ఎన్నికల కసరత్తు జరుగుతోంది. ఇందులో ప్రస్తుతం జిల్లా విద్యాశాఖకు సంబంధించిన 4756 మంది టీచర్లను ప్రభుత్వం కేటాయించింది. వీరిలో ప్రిసైడింగ్‌ ఆఫీసర్‌, అసిస్టెంట్‌ ప్రిసైడింగ్‌ ఆఫీసర్లు, పోలింగ్‌ అధికారి బూత్‌లో ఉండే మరికొన్ని విధులను కేటాయిస్తారు. వీరికి ప్రతి ఎన్నికల్లో పెద్ద భాగస్వామి ఉంటుంది. జిల్లా పాలిటెక్నిక్‌ కళాశాలలో పోలింగ్‌ సామాగ్రి కేటాయింపు, శిక్షణ కార్యక్రమాలు ఇతరత్రా ప్రక్రియ ఎక్కువగా జరుగుతుంది. ప్రస్తుతం వీరికి నూతన కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. టీచర్లలో మరో 20 శాతం మందిని అధికారులు ఎన్నికల విధులకు రిజర్వ్‌ చేస్తారు. 60 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారిని ఎన్నికల విధులకు కేటాయిస్తారు. పోలింగ్‌ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు సంబంధించి టీచర్ల కేటాయింపు ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వారికి సైతం బాధ్యతలను ఎక్కువగా కేటాయిస్తారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బెటాలియన్‌ కమాండెంట్‌ రాంప్రకాశ్‌ దంపతులు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఏడో బెటాలియన్‌ ఆవరణలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నిత్యహవనం, బలిహరణం, వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యహవనము, హారతి, తీర్థప్రసాద వితరణ, శ్రీలక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన, రాత్రి స్వామి వారికి గరుడవాహన సేవా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బెటాలియన్‌ కమాండెంట్‌ రాంప్రకాశ్‌, విజయలక్ష్మీ దంపతులు, ఆలయ ధర్మకర్త శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ భూదానకర్త కుమారులు ప్రమోద్‌జాజు, వినోద్‌ జాజు, అసిస్టెంట్‌ కమాండెంట్స్‌ సి.అంజనేయరెడ్డి, కె.భాస్కరరావు, ఏవో హంసరాణి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీపీ ఉమ్మడి జిల్లా అభ్యర్థుల ప్రకటన


మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ ఉమ్మడి జిల్లాలో నేషనలిస్ట్‌ కాంగ్రెస్‌ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌జాదవ్‌ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విఠల్‌ శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ప్రజలను తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పోటీల్లో ఆర్మూర్‌ నుంచి ఎండీ పాషా, బోధన్‌ నుంచి మానస్‌ బిన్‌ ఊమర్‌ బామద్‌, నిజామాబాద్‌ అర్బన్‌ నుంచి షేక్‌ ఫజల్‌ కరీం, నిజామాబాద్‌రూరల్‌ నుంచి శివరాం మహరాజ్‌, కామారెడ్డి నుంచి విఠల్‌ మాలవత్‌, బాల్కొండ నుంచి జక్కుల గంగారెడ్డి, బాన్సువాడ నుంచి రాజేశ్వర్‌గౌడ్‌, ఎల్లారెడ్డి నుంచి సునీల్‌జాదవ్‌, జుక్కల్‌ నుంచి బందె శ్రీనివాస్‌ పార్టీ నుంచి పోటీల్లో ఉంటారన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్‌ యాదగిరి

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్‌ యాదగిరి సూచించారు. మండలంలోని రాంపూర్‌ సొసైటీ ఆధ్వర్యంలో మల్లాపూర్‌, తిర్మన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. డీఎస్‌వో చంద్రశేఖర్‌, డీసీవో సింహాచలం, సివిల్‌సప్లై డీఎం జగదీశ్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. వడ్ల తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో నాగరాజు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి


కాలూర్‌లో పంట దిగుబడిని పరిశీలిస్తున్న వాజిద్‌ హుస్సేన్‌

నిజామాబాద్‌ రూరల్‌: పంట కోత సమయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌ హుస్సేన్‌ అన్నారు. రూరల్‌ మండలంలోని కాలూర్‌ గ్రామంలో వరి పంటను శుక్రవారం పరిశీలించారు. ఒక్క ఎకరంలో వరి పంట దిగుబడి తెలుసుకోవాలంటే 25 చదరపు మీటర్ల పొలంలో వరి పంటను కోసి తూకం వేస్తే వచ్చే ధాన్యం కిలోల ఆధారంగా పంట దిగుబడి తెలుసుకోవచ్చన్నారు. కోత దశలో దోమ పోటు, ఉశ, తాలు, తప్ప, ఎరుపు గింజలు రంగు మారడం వంటి రోగాలు కనిపిస్తే మండల వ్యవసాయ అధికారి సూచనలతో తగిన మందులను పిచికారీ చేయాలన్నారు. రైతులు సహకార సంఘల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని కోరారు. ఆయన వెంట ఏడీఏ ప్రదీప్‌, మండల వ్యవసాయ అధికారిణి హీరాజాదవ్‌, ఏఈవోలు స్వాతిలత, రమాకాంత్‌, ఏఎస్‌వో దీపిక, డీవైఎస్‌వో గంగాధర్‌, రైతులు ఉన్నారు.

క్రైం కార్నర్‌

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గాంధారి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై ప్రేమ్‌దీప్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలాల ఉన్నాయి. గ్రామానికి చెందిన సతీశ్‌, బూక్య శివ ప్రధాన రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో కింద పడ్డ ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గాంధారి: చద్మల్‌ తండాకు చెందిన కేతావత్‌ సునీత(35) చికిత్స పొందుతు గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సునీత కడుపు నొప్పి భరించలేక ఈ నెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా గురువారం రాత్రి చికిత్స పొందుతు మృతి చెందింది. మృతురాలి భర్త వసంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహితపై అత్యాచారం

పెద్దకొడప్‌గల్‌: వివాహితపై ఒకరు అత్యాచారం చేసిన ఘటన మండలంలోని పోచారం తండాలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం తండాకు చెందిన ఓ వివాహిత ఇంటికి కేమ్రాజ్‌ కల్లాలికి చెందిన తెలిసిన వ్యక్తి సాతే సింగ్‌ తరచూ వస్తుండేవాడు. అదే క్రమంలో గురువారం రాత్రి వచ్చిన సదరు వ్యక్తి ఆమె ఇంటి ఎదుట నిద్రించాడు.

శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో వివాహిత కాలకృత్యాల నిమిత్తం ఇంటి వెనుకాల ఉన్న బాత్రూంకు వెళ్లగా అదే సమయంలో సాతేసింగ్‌ వెనుకాల నుంచి బాత్రూంలోకి వెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.9.25లక్షల నగదు స్వాధీనం



బాన్సువాడ రూరల్‌: వాహనాల తనిఖీలో భాగంగా తాడ్కోల్‌ చౌరస్తాలో కారు నుంచి ఒకరి వద్ద రూ.9.25 లక్షల నగదు లభించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. నసురుల్లాబాద్‌ మండలం అంకోల్‌క్యాంపునకు చెందిన మణివృధ్వీ అనే సిమెంట్‌ షాపు నిర్వాహకుడి నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఉన్నతాధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని మూడోచోట్ల వ్యభిచార గృహాలపై దాడి నిర్వహించినట్లు సీఐలు అజయ్‌, అంజయ్య తెలిపారు. స్థానికుల ముందస్తు సమాచారం నిమిత్తం ఏక కాలంలో వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించగా నిర్వాహకులతో పాటు ఐదుగురు విటులు, పది మంది బాధిత మహిళలను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సరిహద్దులో పక్కా నిఘా పెట్టాలి


కందకుర్తి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీపీ

బోధన్‌: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో పక్కా నిఘా పెట్టాలని సీపీ కల్మేశ్వర్‌ అధికారులను ఆదేశించారు. అక్రమంగా డబ్బు, మద్యం రవాణ జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దులోని సాలూర మండల కేంద్రం శివారులో ఉన్న చెక్‌పోస్టు, బోధన్‌ మండలంలోని ఖండ్గాం చెక్‌పోస్టులను సీపీ, ఏసీపీ కిరణ్‌కుమార్‌లతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుకు కిలో మీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్ర ప్రాంత చెక్‌ పోస్టును సీపీ సందర్శించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించ కూడదని పేర్కొన్నారు.

విధులపై అప్రమత్తంగా ఉండాలి

రెంజల్‌: అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ కల్మేశ్వర్‌ సూచించారు. మండలంలోని కందకుర్తి ఇంటిగ్రేటెడ్‌ చెక్‌పోస్టును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు జిల్లాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. అవసరమైతే కేంద్ర బలగాలతో చెక్‌పోస్టులను పటిష్ఠం చేస్తామన్నారు. సీపీ వెంట ఏసీపీ కిరణ్‌కుమార్‌, రూరల్‌ సీఐ శ్రీనివాస్‌రాజ్‌, రెంజల్‌ ఎస్సై ఉదయ్‌ కుమార్‌ ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్‌, రీజినల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ రాజేంద్ర సింగ్‌


మాట్లాడుతున్న రాజేంద్రసింగ్‌

కామారెడ్డి టౌన్‌: వ్యవసాయ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉత్తమ స్థానంలో ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్‌ రీజినల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ రాజేంద్ర సింగ్‌ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బీఎస్సీ అగ్రికల్చర్‌ కోర్సుపై సెమినార్‌ నిర్వహించారు. మూడు సంవత్సరాల అగ్రికల్చర్‌ కోర్సు ఎంతో విశిష్టమైనదన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ విజయ్‌కుమార్‌, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.